సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం, 9, జూన్, 2023



జీలుగ సాగు.. ఫలితాలు బాగు

రైతులు జీలుగ, పిల్లిపెసర, సాగు చేస్తే చక్కటి ఫలితాలు సాధించవచ్చు. - 8లో



వేధింపులు భరించలేకే హత్య

ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త మద్యం మత్తులో ప్రతిరోజు వేధింపులకు గురిచేస్తుండటంతో విసిగి, వేసారి బాధలు భరించలేక పెట్రోల్ పోసి తగులబెట్టింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.290
రెండోరకం	రూ.150	రూ.220



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1,683 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	280	432
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 301.24 కిలోలు

న్యూస్‌రీల్

బౌద్ధ పర్యాటక కేంద్రం లీజుకు టెండర్లు

రాయచోటిటౌన్ : అన్నమయ్య జిల్లా నందలూరు మండలం అడపూరు గ్రామంలో ఉన్న బౌద్ధ స్థూపాల వద్ద నిర్మించిన పర్యాటక బుద్ధుని కేంద్రాన్ని 10 సంవత్సరాలు లీజుకు ఇచ్చేందుకు వేలం పాట నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేలం పాట ఈనెల 13వ తేదీ మంగళవారం రాయచోటిలోని జిల్లా పర్యాటక శాఖ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు రూ.2 వేలు ధరావత్తు సొమ్మును చెల్లించి పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాల కోసం 6309942032కు ఫోన్ ద్వారా కానీ లేదా నేరుగా పర్యాటక కార్యాలయం వద్దకు వచ్చి సంప్రదించాలని సూచించారు.

వీరభద్రుడిని దర్శించుకున్న శివమణి



వీరభద్రస్వామి సన్నిధిలో శివమణి

రాయచోటిటౌన్ : సినీ సంగీత ప్రముఖుడు, డ్రమ్మర్ శివమణి గురువారం రాయచోటి వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ అధికారులు, ప్రధాన అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.

ఎంఎల్‌హెచ్‌పీలు మెరుగైన వైద్య సేవలు అందించాలి

మదనపల్లె: మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ)లు హెల్త్ సెంటర్లలో, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ క్లినిక్‌లో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. గురువారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఎంఎల్‌హెచ్‌పీల మూడవ బ్యాచ్ హాండ్స్ ఆన్ ట్రెనింగ్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రథమ చికిత్స, పాముకాటు, టీబీ వ్యాధులపై, పేషంట్‌లకు ఫ్లూయిడ్స్ అందించే విధానంపై సూచనలు ఇచ్చారు. డీపీఎంఓలు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల సన్నద్ధతకు ఇండక్షన్ ట్రెనింగ్ ఉపయోగకరం



మాట్లాడుతున్న మహమ్మద్ అయూబ్

రాయచోటి అర్బన్ : విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించేందుకు ఉర్దూ ఉపాధ్యాయులకు ఇండక్షన్ ట్రెనింగ్ ఎంతో ఉపయోగకరమని రూటా రాష్ట్ర సమన్వయకర్త మహమ్మద్ అయూబ్ అన్నారు. గురువారం స్థానిక డైట్ కళాశాలలో నిర్వహించిన 1998, 2008 ఎంటీఎస్ ఉర్దూ, డీఎస్సీ 2018 ఉర్దూ ఎస్‌జీటీ ఉపాధ్యాయుల శిక్షణా శిబిరాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ అసదుల్లాబాషా, కో-ఆర్డినేటర్ జాఫర్ హుస్సేన్, రిసోర్స్‌పర్సన్‌లు సత్తార్‌ఫైజీ, సిబాతుర్ రహిమాన్, జాఫరుద్దీన్, ఇమ్రోజ్‌ఖాన్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

మిషన్ రాయలసీమ..
అంతా కపట ప్రేమ



- నాడు ఎన్టీఆర్‌ను అలా.. నేడు రాయలసీమను ఇలా..!
- నారా లోకేష్ మిషన్ రాయలసీమ డిక్లరేషన్‌పై మండిపడుతున్న మేధావులు
- అధికారంలో ఉన్నన్నాళ్లు గండికోట ప్రాజెక్టు అప్రాధాన్య జాబితాలోనే
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను విస్తరించిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి
- టీడీపీ నేత దేవినేని ఉమా ద్వారా అనేక అడ్డంకులు సృష్టించిన చంద్రబాబు



సాక్షి ప్రతినిధి, కడప: వినేవారు లోకువైతే చెప్పేవాడు చంద్రబాబు అన్నది విశ్లేషకుల నానుడి. ఇప్పుడు సరిగ్గా ఇదే రీతిలో వ్యవహరిస్తున్నారు చంద్రబాబు తనయుడు నారా లోకేష్. నాడు ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి పదవి నుంచి దించేసి మానసిక క్షోభకు గురిచేసి, ఆయన మరణానికి దారితీసిన పరిస్థితుల్ని చంద్రబాబు అండ్ కో సృష్టించారు. ఇటీవల ఎన్టీఆర్ శత జయంతి వేడుకల పేరుతో ఆయా నేతలే హంగామా చేశారు. అప్పటి ఉదంతాన్ని 'మిషన్ రాయలసీమ' గుర్తు చేస్తోంది. యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్న నారా లోకేశ్ కడపలో ప్రకటించిన 'మిషన్ రాయలసీమ' డిక్లరేషన్‌పై నాడు ఎన్టీఆర్ పట్ల అలా... నేడు రాయలసీమ విషయంలో ఇలా... నక్క వినయం ప్రదర్శిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

విభజన ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నన్నాళ్లు రాయలసీమను టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అదేమంటే రాయలసీమలో తమకు ఓట్లు, సీట్లు ఇవ్వరని, అందుకే అభివృద్ధి చేయలేదని నిర్లజ్జగా ప్రకటించారు. గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో సీఎం హోదాలో చంద్రబాబు నాయుడు పాణ్యంలో బహిరంగంగా ఆ విషయాన్ని వెల్లడించారు. అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి ఒక్కరే అన్న నగ్న సత్యాన్ని విస్మరించి వితండవాదాన్ని తెరపైకి తెచ్చారు చంద్రబాబు. నిర్దిష్ట అభివృద్ధి సాధించే అవకాశం ఉన్నా టీడీపీ ప్రభుత్వ హయాంలో రాయలసీమ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని పలువురు వాపోతున్నారు.

గతమంతా రాయలసీమ పట్ల నిర్లక్ష్యమే..

1995–2004 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, 2014–19 విభజన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు రాయలసీమ పట్ల పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శించారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులంటే మండిపడేవారు. తాజాగా 25 టీఎంసీలు నీటి నిల్వకు కారణమైన గండికోట ప్రాజెక్టును ఉమ్మడి ఏపీలో అప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాలోకి చేర్చిన చరిత్రను చంద్రబాబు మూట గట్టుకున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు నీరు చేరాలంటే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ ఒక్కటే మార్గమని తలచారు. అలా చేస్తేనే కాస్తో, కూస్తో రాయలసీమ ప్రాంతానికి నీరు చేరుతుందని మనస్ఫూర్తిగా నమ్మారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని వైఎస్సార్ సర్కార్ పెంచుతుంటే, టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరరావు ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేసింది చంద్రబాబు కాదా అని ఈ ప్రాంత వాసులు నిలదీస్తున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాతైనా రాయలసీమ అభివృద్ధికి కృషి చేస్తారంటే ఐదేళ్ల కాలం ఊకదంపుడు ఉపన్యాసాలతో సరిపెట్టారని పలువురు గుర్తు చేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ కడపలో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం పాస్ చేసిన బిల్లు మేరకు ఏర్పాటు చేయలేకపోయారు. పైగా సీఎం హోదాలో ఈ ప్రాంతంలో పర్యటించిన ప్రతిసారి చంద్రబాబు హార్టికల్చర్ హబ్, టూరిజం సర్క్యూట్, మైనింగ్ డెవలప్‌మెంట్ ఇలా చెప్పిందే చెప్పి రాయలసీమ ప్రజలను ఊరించారు. తాజాగా ఆ జాబితాలోకి నారా లోకేష్ వచ్చి చేరిపోయారని పలువురు విమర్శిస్తున్నారు.

పిన్నమ్మకు బంగారు గాజులు...

టీడీపీ అధినేత చంద్రబాబు గురించి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అన్న మాటలను జనం గుర్తు చేసుకుంటున్నారు. 'అమ్మకు అన్నం పెట్టని వాడు, పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తానని అన్నారట' అని బాబు వైఖరిని ఒక్క మాటలో అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఆవిష్కరించారు. ఇప్పుడు నారా లోకేశ్ రాయలసీమ మిషన్ పేరుతో ఇస్తున్న హామీలు పెద్దబాబు గురించి వైఎస్సార్ చెప్పిన చందంగా ఉన్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. రాయలసీమలో పుట్టి పెరిగిన చంద్రబాబునాయుడు 14 ఏళ్లపాటు సీఎంగా పని చేసి, సొంత ప్రాంతానికి ఏమీ చేయకపోవడం వల్లే సీమకు ఈ దుస్థితి అని లోకేశ్‌కు తెలియదా? అని మేధావులు మండిపడుతున్నారు. కేవలం రాజకీయ బతుకుల్ని మార్చుకునేందుకే మిషన్ రాయలసీమ అంటూ మాయమాటలు చెబుతున్నారని, ఇప్పటికీ రాయలసీమ పట్ల వివక్ష లేకపోలేదని పలువురు వెల్లడిస్తున్నారు. కొత్త నగరాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు కోరగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కార్ కొప్పర్తిని ఎంపిక చేసింది. అమరావతిని ఎంపిక చేయకుండా కొప్పర్తి ప్రతిపాదనలు పంపారని సన్నాయి నొక్కులు ఎల్లోబ్యాచ్ అందుకుంది. కనీసం కర్నూలులో హైకోర్టు ఇస్తామని లోకేశ్ హామీ ఇవ్వకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? అంటూ ప్రజలు నిలదీస్తున్నారు. పెద్దబాబు, చినబాబు మాయమాటలు నమ్మే అమాయక స్థితిలో సీమ ప్రజలు లేరనే అభిప్రాయం వివిధ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.

అధికారం కోసమే మిషన్ రాయలసీమ



అధికారంలో ఉంటే చంద్రబాబు నాయుడు కళ్లు లేని కబోదిలా ఉంటారు. అధికారం లేకపోతే అసంబద్ధ ప్రేలాపనలు చేయడం టీడీపీ నేతలకు సర్వసాధారణం. విజన్ 2020 అలాంటిదే. 2000 సంవత్సరంలో విజన్ 2020 ప్రకటించారు. ఆమేరకు పాలన చేసి ఉంటే 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి ఉండేది కాదు కదా? పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ చేయాలనే ఆలోచన టీడీపీ సర్కార్‌కు ఎందుకు రాలేదు? వైఎస్సార్ సర్కార్ పోతిరెడ్డిపాడు విస్తరణ చేసింది కాబట్టే, ఈరోజు రాయలసీమకు నీరు వస్తోంది. పెద్దబాబు బాటలోనే చినబాబు కూడా పయనిస్తున్నారు.

–టి శివప్రసాద్, ఎకనామిక్స్ ప్రొఫెసర్

ఏ మిషన్ చినబాబు? ఓట్ల మిషనా... సీట్ల మిషనా?



కృష్ణా డెల్టా రైతులకు మూడు కార్ల పంటల కోసం జీఓ నంబర్ 69 ద్వారా శ్రీశైలం ప్రాజెక్టులో కనీస నీటిమట్టం ఎత్తు 835 అడుగులకు తగ్గిస్తూ సీఎం హోదాలో చంద్రబాబు నాడు నిర్ణయం తీసుకుని రాయలసీమ ప్రజల గొంతు పిసికారు. పాత కాలువలకు గండ్లు కొట్టి మోటార్లు బిగించి జాతికి అంకితం చేయడం తప్పా, మొన్నటి తొమ్మిదేళ్ల పాలన, నిన్నటి ఐదేళ్ల పాలనలో రెయిన్ గన్లతో కరువు పారదోలడం కాకుండా చంద్రబాబు పూర్తి చేసిన ప్రాజెక్టు ఏమైనా ఉందా? ఉదయం లేచింది మొదలు నిత్యం అమరావతి మంత్రం జపిస్తూ, మనసా వాచా కర్మనా వికేంద్రీకరణను వ్యతిరేకించే మీరు రాయలసీమ అభివృద్ధికి కృషి చేస్తామంటే నమ్మాలా? రాష్ట్రంలో ఏమూలన చీమ చిటుక్కుమన్నా రాయలసీమ రౌడీలు, గూండాలంటూ ఆత్మాభిమానం దెబ్బతీస్తున్నారు. వర్తమానంలో మీరు చేస్తున్నదంతా, భవిష్యత్తులో మీరు చేయబోతున్నదంతా అద్భుతమే అనడం మీ అవకాశవాదం.

–వివేక్ లంకమల, సామాజికవేత్త

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి



వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు

వాల్మీకిపురం: బాస్కెట్ బాల్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని అన్నమయ్య జిల్లా డీఎస్‌డీఓ షేక్ షఫీ పేర్కొన్నారు. గురువారం స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చింతల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకిపురం బాస్కెట్ బాల్ అసోసియేషన్ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు పాటిస్తోందన్నారు. బాస్కెట్ బాల్‌కు మంచి వేదిక దొరకడం ఈ ప్రాంత యువతకు మంచి వరం అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్లు, నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతల శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి రవిచందర్, సుబ్రమణ్యం, పద్మనాభ కుమార్, కోచ్‌లు సాయి భార్గవ్, కిరణ్ రెడ్డి, అంజిబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ నిర్మాణ పనుల్లో కదలిక

పనులను ప్రారంభించిన వీసీ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం నూతన భవన నిర్మాణాలకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయం కోసం యోగివేమన విశ్వవిద్యాలయం ఆనుకుని 110.36 ఎకరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే ఇటీవల విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డిలు రెవెన్యూ అధికారులను కలిసి కేటాయించిన భూములకు హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో పెండ్లిమర్రి రెవెన్యూ అధికారులు విశ్వవిద్యాలయానికి కేటాయించిన భూమికి సంబంధించిన హద్దులను చూపడంతో విశ్వవిద్యాలయం సిబ్బంది హద్దుల వెంబడి జెండాలను పాతారు.

పనులను ప్రారంభించిన వీసీ ఆచార్య బానోతు..

జూలై 8వ తేదీన విశ్వవిద్యాలయ భవన నిర్మాణాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించాలన్న లక్ష్యంతో వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ అధికారులు భూమి చదును పనులను ప్రారంభించారు. గురువారం విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్ వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ భూముల్లో పూజ నిర్వహించి, టెంకాయకొట్టి జేసీబీ సహాయంతో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అనుకున్న విధంగా పనులన్నీ సాగితే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించాలన్న లక్ష్యంతో ఉన్నామన్నారు. ఇందుకోసం రెవెన్యూ, అటవీ అధికారుల నుంచి క్లియరెన్స్ వచ్చిందన్నారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ సూపరింటెండెంట్ యెద్దుల పవన్ కుమార్‌రెడ్డి, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.



టెంకాయకొట్టి పనులను ప్రారంభిస్తున్న వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్

నీటిపారుదల శాఖలో భారీగా బదిలీలు

కడప సిటీ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని నీటిపారుదలశాఖలో భారీగా బదిలీలు జరిగాయి. ఈ మేరకు వాటర్ రీసోర్స్ డిపార్టుమెంటు ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడుగురు ఉన్నతాధికారులు, 11 మంది డీఈలు, 20 మంది ఏఈలకు స్థాన చలనం కలిగింది. తెలుగుగంగ ప్రాజెక్టు (ఎఫ్‌ఏసీ) ఎస్ఈగా వెంకట్రామయ్య నియమితులయ్యారు. ఈయన మైలవరం ప్రాజెక్టు ఈఈగా కొనసాగుతూ కడప ఇరిగేషన్‌శాఖకు ఈఈ (ఎఫ్‌ఏసీ)గా కొనసాగుతున్నారు. ప్రస్తుతం కడప ఇరిగేషన్ ఈఈగా బదిలీ చేస్తూ అదనపు బాధ్యతలుగా టీజీపీ ఎస్ఈగా నియమించారు. మైలవరం ప్రాజెక్టు ఈఈగా మార్కాపురం నుంచి తిరుపాలయ్యను బదిలీ చేశారు. ఇక్కడ టీజీపీ ఎస్ఈగా ఉన్న శారద కడప క్వాలిటీ కంట్రోల్ డిజైన్స్ ఎస్ఈగా బదిలీ అయ్యారు. టీజీపీ డివిజన్ ఈఈగా ఉన్న రామునాయక్ జీఎన్‌ఎస్ఎస్ డివిజన్–5 (జమ్మలమడుగు) ఈఈగా బదిలీ అయ్యారు. వెలిగల్లు ప్రాజెక్టు ఈఈగా ఉన్న మధుసూదన్‌రెడ్డిని జీఎన్‌ఎస్ఎస్ డిప్యూటీ ఎస్ఈగా బదిలీ చేశారు. జీఎన్‌ఎస్ఎస్–6 ఈఈగా ఉన్న ఇలియాస్ బాషాను సీసీ–3 ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బదిలీ చేశారు. ధవళేశ్వరంలో పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని వెలిగల్లు ఈఈగా బదిలీ చేశారు. జీఎన్‌ఎస్ఎస్ సర్కిల్ డిప్యూటీ ఎస్ఈగా ఉన్న ఐజాక్ శ్యాముల్ డిప్యూటీ సీఈ (ప్రాజెక్టులు) కడపకు బదిలీ అయ్యారు. క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈగా ఉన్న వెంకట రమణకు తిరుపతి సీఈ (ప్రాజెక్టులు)గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అంతేకాకుండా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఆయా ప్రాంతాల నుంచి 11 మంది డీఈలతోపాటు మరో 20 మంది ఏఈలకు స్థాన చలనం కలిగింది. రెండు,మూడు రోజుల్లో వీరంతా విధుల్లో చేరనున్నారు.

12న జగనన్న విద్యా కానుక పంపిణీ

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జగనన్న విద్యాకానుకకు సంబంధించిన కిట్లు ఈనెల 12వ తేదీలోపు అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి విద్య, జగనన్నకు చెబుదాం, ఆరోగ్యం, స్పందన తదితర అంశాలపై అన్ని జిల్లా కలెక్టర్‌లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న విద్యాకానుకలో భాగంగా విద్యార్థులకు అన్ని రకాల పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు తదితర వాటిని ఈనెల 12వ తేదీలోపు పంపిణీ చేసేలా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.



తహసీల్దార్‌ల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలి

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను సత్వరం పరిష్కరించాలని, ఆయా కేసులకు సంబంధించిన వివరాలతో కౌంటర్లను వేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కోర్టు కేసులు, ఎన్నికలు తదితర అంశాలపై సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. స్థానిక కోర్టులు, హైకోర్టులు పెండింగ్‌లో ఉన్న కేసులపై ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు అనే విషయమై అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ వివరాలు సేకరించారు. కోర్టు కేసులను సీరియస్‌గా తీసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు.

జాతీయ రహదారి భూ సేకరణ పూర్తి చేయాలి

కడప–రేణిగుంట జాతీయ రహదారికి అవసరమైన భూ సేకరణను వేగవంతం చేయాలని తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. అలాగే పక్కాగా ఓటరు జాబితాను పరిశీలించాలన్నారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు రంగస్వామి, మురళీ, భాస్కర్, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, భూ సేకరణ విభాగం సూపరింటెండెంట్‌లు మహేశ్వర్ రెడ్డి, నాగభూషణం, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస చర్యలు వేగవంతం చేయాలి

రాయచోటి : మంగంపేట నిర్వాసితుల పునరావాస చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగంపేట ఖనిజాభివృద్ధి సంస్థకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, రైతులకు పరిహార పంపిణీ, పునరావాస చర్యలు తదితర వాటిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సమీక్షించారు. పరిహారం పంపిణీ చేసిన భూములను వెంటనే ఏపీఎండీసీకి అప్పగించాలని కలెక్టర్ సూచించారు. ఆర్ అండ్ ఆర్ లేఅవుట్‌కు సంబంధించి భూమి చదునుతో పాటు మ్యాపింగ్, ప్లాట్ కేటాయింపు ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. ఆ లేఅవుట్‌లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు చర్యలు తీసుకొని పనులు ప్రారంభించాలన్నారు. ఒక ఎకరా సబ్‌స్టేషన్‌కు స్థలం కేటాయించాలని ఓబులవారిపల్లి తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రాజంపేట ఇన్‌చార్జి ఆర్డీఓ భాస్కర్, ఆర్ అండ్ బీ ఎస్ఈ సహదేవరెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ, ఏపీఎండీసీ సీపీఓ సుదర్శనరెడ్డి, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ మహేశ్వర్‌రెడ్డి, ఓబులవారిపల్లి తహసీల్దార్ పీర్ మున్నీ, ఏపీఎండీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జలశక్తి అభియాన్ బృందం పరిశీలన



కలికిరి సైనిక పాఠశాలలో పర్యటిస్తున్న కేంద్ర జలశక్తి అభియాన్ బృందం

కలికిరి: కేంద్ర జలశక్తి అభియాన్ బృందం గురువారం మండలంలో పర్యటించింది. బృందం నోడల్ అధికారి ప్రకాష్ కిచి, జియో సైంటిస్ట్ ఏకే పవార్‌లు ఉదయం 10 గంటలకు మండల పరిధిలోని మహల్ వద్ద రైతు శ్రీరాములు పొలంలో తవ్విన ఫారంపాండ్, మామిడి మొక్కల పెంపకం పనులు పరిశీలించారు. అనంతరం కలికిరి సైనిక పాఠశాలలోని బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్ యూనిట్, ఎన్‌ఆర్ఈజీఎస్, అటవీశాఖ ఆధ్వర్యంలో హైడెన్సిటీ పద్ధతిలో పెంచిన మొక్కలను కూడా చూశారు. డ్వామా పీడీ మద్దిలేటి, మహల్ సర్పంచ్ తస్లీ బారియాజ్ అహ్మద్, కలికిరి క్లస్టర్ ఏపీడీ మధుబాబు, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వాన్, ఎంపీడీఓ గంగయ్య, పీఏఓ సుజాత పాల్గొన్నారు.

వాల్మీకిపురం: జలశక్తి అభియాన్ యోజన పనులను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర బృందం సభ్యులు ప్రకాష్, భూగర్భ శాస్త్రవేత్త ఏకే పవార్ అన్నారు. చింతపర్తి ఎస్సీ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ని పరిశీలించి, వర్షపు నీటిని ఎలా ఆదా చేయాలో డెమో ద్వారా చూపించారు. వైస్ ఎంపీపీ కిరణ్ కుమార్, సర్పంచ్ భాస్కర్, పంచాయతీ సెక్రటరీ పుష్పావతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేధింపులపై కేసు నమోదు

కలకడ : యువతిని వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ తిప్పేస్వామి కథనం మేరకు... మండలంలోని ముడియంవారిపల్లికి చెందిన ఓ యువతిని నవాబుపేటకు చెందిన రాంప్రసాద్ ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడటం, మెసేజ్‌లు పంపటం చేస్తున్నాడని యువతి తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

హరియానాకు చెందిన వ్యక్తి మృతి

సిద్దవటం : హరియానా రాష్ట్రానికి చెందిన షోహిన్‌లాల్ (31) అనే వ్యక్తి భాకరాపేట గ్రామ సమీపంలోని శనేశ్వర స్వామి గుడి వద్ద గురువారం ఉదయం మృతి చెందాడు. ఎస్ఐ తులసీ నాగప్రసాద్ కథనం మేరకు షోహిన్‌లాల్ వృత్తిరీత్యా లారీ డ్రైవర్. అతనికి మితిస్థిమితం లేదు. బుధవారం ఉదయం ఒంటిమిట్టలో లారీ దిగి కనిపించకుండా పోయాడు. తోటి డ్రైవర్ ఫోన్ చేస్తే తాను రానని చెప్పాడు. దీంతో షోయాల్ ఇంటికి ఫోన్ చేసి చెప్పాడు. గురువారం ఉదయం సిద్దవటం మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న మందగిరి శనేశ్వరస్వామి ఆలయం వద్ద మృతి చెంది ఉన్నాడు ఆలయ సిబ్బంది సమాచారం పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అతని ఒంటిపై షర్టు, ప్యాంట్ విప్పేసి సెల్ ఫోన్‌తో పాటు పక్కనే ఉన్నాయని, డ్రాయర్‌తో ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటోబోల్తా

– 8మందికి గాయాలు



మదనపల్లె : ప్యాసెంజర్ ఆటో బోల్తా పడి ఎనిమిది మందికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం కురబలకోట మండలం చేనేతనగర్ వద్ద జరిగింది. అంగళ్లు నుంచి మదనపల్లెకు ప్రయాణికులతో వస్తున్న ఆటోలో టమాటా మండీలో పనిచేసే కూలీలు, మరికొంతమంది ఉన్నారు. చేనేత నగర్ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించపోయి ఆటోడ్రైవర్ ఆటోను పక్కకు తిప్పాడు. వేగాన్ని అదుపుచేయలేక పోవడంతో ఆటో రోడ్డుపక్కన బోల్తా పడింది. ప్రమాదంలో మదనపల్లెకు చెందిన రెడ్డిరాణి(30), అరుణ(35), రెడ్డెమ్మ(55), ఫాతిమా(70), చిన్నరెడ్డెమ్మ(29), వాహిదా(55), ఫైజల్(5), ఆటోడ్రైవర్ మహేశ్వర్(36) గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జీలుగ సాగు.. ఫలితాలు బాగు

అధిక దిగుబడులనిచ్చే పచ్చి రొట్టసాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



రాయచోటి ప్రాంతంలో సాగులో ఉన్న జీలుగ పంట

రాయచోటి : రైతులు జీలుగ, పిల్లిపెసర, సాగు చేస్తే చక్కటి ఫలితాలు సాధించవచ్చు. తక్కువ సారవంతమైన భూముల్లో నల్లటి మట్టిని వేస్తే మంచి దిగుబడులు వస్తాయి. రైతులు మట్టిని వేసే బదులు నేల స్వభావాన్ని బట్టి పచ్చి రొట్ట ఎరువుల సాయంతో మరింత సారవంతంగా మార్చుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఖరీఫ్ సాగును దష్టిలో పెట్టుకొని రైతు భరోసా కేంద్రాల ఆధ్వర్యంలో గ్రామాల్లో సదస్సులు నిర్వహించి ప్రకృతి సిద్ధంగా లభించే ఎరువులు, వాటి ఉపయోగాల గురించి వివరిస్తున్నారు. రైతులు కూడా పచ్చి రొట్ట సాగు విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లి పెసర సాగుపై మక్కువ చూపుతున్నారు. ఇందుకు అవసరమైన పచ్చిరొట్ట సాగు విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోంది.సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

లాభాలు ఇవీ..

- పొలంలో జీలుగను కలియదున్నిన తర్వాత అవి నేలకు, తర్వాత వేసే పంటలకు విశేషమైన లాభాలు అందిస్తుంది.
- ప్రధాన పంటకు ముందస్తుగా నేలను తయారు చేస్తుంది.
- జీలుగ సాగుతో మూడు టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభిస్తుంది.
- మొక్కలకు 2 శాతం నత్రజని, సూపర్ పాస్పేట్‌ను అదనంగా అందిస్తాయి.
- జింక్ మాంగనీస్, ఇనుము, క్యాల్షియం వంటి సూక్ష్మధాతువులను పంటకు చేకూరుస్తాయి.
- నేలపై కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మారుస్తాయి.
- నీటి నిల్వ సామర్థ్యాన్ని అధికంగా పెంచుతుంది
- వానపాముల ఉత్పత్తికి దోహదం చేస్తాయి.
- లెగ్యూ జాతికి చెందిన మొక్కకావడంతో వేర్లలో నత్రజని స్థిరీకరణ అధికంగా ఉంటుంది.
- తుంగ, గరిక వంటి కలుపు మొక్కలను అడ్డుకుంటుంది.

అందుబాటులో విత్తనాలు



ప్రభుత్వం సబ్సిడీపై జీలుగ విత్తనాలను ఆయా మండల, గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచింది. ఏక వార్షిక మొక్కల్లో ప్రథమస్థానం వీటికే దక్కుతుంది. మొక్కలు నాటిన 30–35 రోజుల్లోనే ఏపుగా పెరుగుతాయి. దుక్కిలో 30 కిలోల యూరియా వేసిన తర్వాత ఎకరానికి 12 కిలోల జీలుగ విత్తనాలు చల్లుకోవాలి. జీలుగను సాగు చేసిన తర్వాత 30 రోజుల్లో ఏపుగా పెరిగి పూతదశకు చేరుకుంటుంది. ఆ సమయంలో మొక్కలను మొదళ్ల వద్ద కత్తిరించాలి.లేకపోతే రొటోవేటర్ సాయంతో పొలమంతా కలియదున్నాలి.తర్వాత 100 కిలోల సింగిల్ సూపర్ పాస్పేట్‌ను దుక్కిలో వేయాలి. సూపర్ పాస్పేట్ వల్ల మొక్కల అవశేషాలు బాగా కుళ్లి పచ్చిరొట్ట ఎరువుగా తయారవుతుంది. పొలంలో జీలుగ, జనుము, పిల్లి పెసర కుళ్లే దశలో నీటిని సక్రమంగా అందించాలి. 10 కిలోల బ్యాగును 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం విక్రయిస్తోంది.

– ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయాధికారిణి

సబ్సిడీపై జీలుగ విత్తనాలు



జీలుగ విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. ఒక్కో రైతుకు 30 కిలోల విత్తనాలను అందజేస్తాం. ప్రభుత్వం సబ్సిడీపై అందజేసే విత్తనాలను రైతులు సకాలంలో తీసుకొని చల్లుకోవాలి

– దివాకర్‌బాబు, మండల వ్యవసాయాధికారి, రాయచోటి

మంచి లాభాలు పొందాలి



జీలుగ ఇతర పచ్చి రొట్ట విత్తనాలను రైతులు కొనుగోలు చేసి వాటితో వచ్చే లాభాలు పొందాలి. ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. గత కొద్ది రోజులుగా జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలను రైతులు కొనుగోలు చేస్తున్నారు.

– వేంపల్లి అఫ్రిన్, రైతు భరోసా అధికారిణి, చాకిబండ

టెంపో వాహనం, బైక్ ఢీ

– వ్యక్తి మృతి



వాహనం బోల్తాపడటంతో నేలపాలైన టమాట



కిషోర్ మృతదేహం

ములకలచెరువు : ద్విచక్రవాహనాన్ని టమాట లోడుతో వెళ్తున్న 407 టెంపో వాహనం ఢీ కొనడంతో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం సాయంత్రం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని దేవులచెరువు పంచాయతీ యర్రంరెడ్డిగారిపల్లెకు చెందిన కిషోర్(45) పెయింట్ పనులు చేసుకుంటూ భార్య, పిల్లలతో ములకలచెరువులో కాపురం ఉంటున్నాడు. పని నిమిత్తం ద్విచక్రవాహనంలో యర్రంరెడ్డిగారిపల్లెకు వెళ్తుండగా స్థానిక గాలేటివారిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న 407 టెంపో వాహనం అదుపుతప్పి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కిషోర్(45) తీవ్రగాయాలతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. వాహనం బోల్తాపడటంతో టమాటాలు సైతం నేలపాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. వాహనాన్ని పక్కకు జరిపి ట్రాఫిక్‌ను నియంత్రించారు. మృతుడికి భార్య శారద, కుమారులు సాయి గణేష్, సాయి బబ్లూ ఉన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు చెప్పారు.

చట్టాలకు లోబడి వ్యాపారాలు నిర్వహించాలి

ఎరువుల డీలర్ల సమీక్షలో డీఏఓ చంద్రానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి చంద్రానాయక్

మదనపల్లె : వ్యవసాయం, రైతులతో అనుబంధం కలిగిన వ్యక్తులుగా, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఎరువుల నియంత్రణ చట్టానికి లోబడి డీలర్లు వ్యాపారాలు చేసుకోవాలని డీఏఓ చంద్రానాయక్ అన్నారు. గురువారం మదనపల్లె అగ్రి డివిజన్ పరిధిలోని ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏడీఏ శివకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డివిజన్‌లోని మదనపల్లె, నిమ్మనపల్లె, ముదివేడు, పీటీఎం, ములకలచెరువు, బి.కొత్తకోట, తంబళ్లపల్లె మండలాలకు చెందిన డీలర్లు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఏఓ చంద్రానాయక్ మాట్లాడుతూ.. వ్యవసాయం చేసేందుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కోసం రైతులు వ్యవసాయశాఖ కన్నా డీలర్లపై ఆధారపడే పరిస్థితే అధికంగా ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వం రైతు ముంగిటకే సేవలను అందించేందుకు ప్రతి పంచాయతీలో రైతుభరోసా కేంద్రాలు(ఆర్‌బీకే) ఏర్పాటుచేసిందన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకుంటే నష్టాల నుంచి కోలుకోవచ్చన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 40 శాతం రాయితీతో ఆర్‌బీకేల ద్వారా అన్నమయ్యజిల్లాలో 48,000 క్వింటాళ్ల వేరుశెనగ విత్తన కాయలు పంపిణీ చేశామన్నారు. విత్తన నాణ్యతపై క్షేత్రస్థాయిలో రైతులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఐక్యరాజ్యసమితి చిరుధాన్యాల సంవత్సరంగా 2023ను ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో వేరుశెనగ, వరితో పాటు చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు సబ్సిడీపై రాగులు, కొర్రలు, సజ్జలు రైతులకు అందిస్తామన్నారు. రైతుల నుంచి అధిక డిమాండ్ కలిగిన మిరప, టమాటా, బొప్పాయి విత్తనాలు మార్కెట్లో డీలర్లు ఎక్కువ ధరకు అమ్ముతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు డీలర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించరాదన్నారు. నాణ్యమైన విత్తనాలు విక్రయించడంతో పాటుగా రైతు ప్రతి కొనుగోలుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రైతుకు నష్టం కలిగినప్పుడు అధీకృత బిల్లు ఉంటే పరిహారం పొందే వీలుంటుందన్నారు. బిల్లు ఇవ్వకుండా విక్రయాలు జరుపుతున్న దుకాణాలపై 6ఏ కేసు నమోదుతో పాటు లైసెన్స్ రద్దుకు వెనుకాడమన్నారు. ప్రతి షాపుముందర స్టాక్ వివరాలు, వాటి ధరల వివరాల బోర్డును తప్పనిసరిగా ఏర్పాటుచేయాలన్నారు. సిమెంట్‌షాపుల్లో, ఇతర దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు విక్రయించడం చేయవద్దన్నారు. రైతు శ్రేయస్సు లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ఆర్‌బీకే వ్యవస్థను అనుసంధానం చేసుకుని 400మంది ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు, 30మంది ఏఓలు ఒక సైన్యంగా పనిచేస్తున్నామన్నారు. రైతు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత వ్యవసాయశాఖతో పాటుగా డీలర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఓ టెక్నికల్ నవీన్‌రెడ్డి, రమణకుమార్, డీలర్లు భవానీశ్రీను, శ్రీనివాస్, సిద్ధా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు భరించలేకే హత్య

భర్తను పెట్రోల్‌పోసి కాల్చి చంపిన కేసులో భార్య అరెస్ట్



నిందితురాలితో డీఎస్పీ కేశప్ప, పోలీసు అధికారులు

మదనపల్లె : ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త మద్యం మత్తులో ప్రతిరోజు వేధింపులకు గురిచేస్తుండటంతో విసిగి, వేసారి బాధలు భరించలేక మౌనంగా రోదించిన భార్య గుండెను రాయి చేసుకుంది. భర్త లేకపోతేనే తాను, పిల్లలు ప్రశాంతంగా ఉండగలమని భావించి అతనిపై పెట్రోల్ పోసి చంపాలని నిర్ణయించుకుంది. అనుకున్న ప్రకారం మద్యం మత్తులో మగతగా పడిఉన్న భర్తపై మంగళవారం అర్ధరాత్రి తర్వాత పెట్రోల్ పోసి తగులబెట్టింది. మంటల్లో కాలుతూ, హాహాకారాలు చేస్తున్న కుమారుడిని గమనించిన తల్లిదండ్రులు హుటాహుటిన బుధవారం వేకువజామున మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శరీరం బాగా కాలిపోవడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఇట్టికోట శ్రీధర్ మరణించాడు. కుమారుడి మరణంపై తండ్రి ఇట్టికోట లక్ష్మయ్య ఫిర్యాదుమేరకు కోడలు పసుపులేటి మమతపై కేసు నమోదుచేశారు. గురువారం ముదివేడు పోలీసులు అరెస్ట్‌చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ కేశప్ప వెల్లడించారు. కురబలకోట మండలం తెట్టుపంచాయతీ పూజారివాండ్లపల్లెకు చెందిన ఇట్టికోట లక్ష్మయ్య కుమారుడు ఇట్టికోటశ్రీధర్, అదే గ్రామానికి చెందిన పసుపులేటి వెంకటరమణ మూడో కుమార్తె మమత ప్రేమించి 2006లో పెళ్లి చేసుకున్నారు. వీరికి లక్కీ, దీపక్ ఇద్దరు కుమారులు ఉన్నారు. పెళ్లి సమయానికే శ్రీధర్ ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు. మద్యానికి బానిసైన శ్రీధర్ విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తుండటంతో ఆర్మీ ఉన్నతాధికారులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిలిపివేస్తూ ఉద్యోగం నుంచి తొలగించారు. భార్య మమత ఆర్మీ ఉన్నతాధికారులను ఆశ్రయించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిలిచిపోతే తన కుటుంబం రోడ్డున పడిపోతుందని ప్రాధేయపడింది. కరుణించిన ఆర్మీ అధికారులు ప్రయోజనాలను కల్పిస్తూ ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో భార్యాభర్తలు, పిల్లలతో కలిసి 2020 నుంచి పూజారివాండ్లపల్లెలో నివాసం ఉంటున్నారు. అయితే రిటైర్మెంట్‌లో భాగంగా వచ్చిన మొత్తం డబ్బులు, నెలవారీ ఫించన్ శ్రీధర్ కుటుంబ అవసరాలకు కాకుండా జల్సాలు, మద్యం తాగేందుకు ఖర్చుచేసేవాడు. అడ్డుచెపితే భార్యపై వేధింపులకు పాల్పడేవాడు. భర్త శ్రీధర్ ప్రవర్తనపై గతంలో పలుమార్లు ముదివేడు పోలీస్‌స్టేషన్‌లో మమత ఫిర్యాదుచేయడం, పెద్దల సమక్షంలో రాజీ కుదుర్చుకోవడం జరిగాయి. రోజులు గడుస్తున్నా శ్రీధర్‌లో మార్పు కనిపించకపోవడం, మూర్ఖత్వం ఎక్కువ కావడం, మొండిగా బెదిరింపులకు పాల్పడుతుండటంతో విసిగిన మమత భర్తను చంపేసి ప్రశాంతంగా ఉండాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగా ఈనెల 6వతేదీ మంగళవారం మదనపల్లెలో పెట్రోల్ కొనుగోలు చేసింది. ఇంటికి వెళ్లి అర్ధరాత్రి దాటిన తర్వాత మద్యం మత్తులో నిద్రపోతున్న భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. ఘటనా స్థలం నుంచి వెళుతుండగా అత్తమామలు గమనించారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోడలు తమ కుమారుడికి చెందిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ కాజేయాలనే దురుద్దేశంతో పెట్రోల్ పోసి హత్యకు పాల్పడిందని పేర్కొన్నారు. మమతను ముదివేడు పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపారు. విచారణలో రూరల్ సీఐ శివాంజనేయులు, ఎస్ఐ ముబీన్‌తాజ్ సమర్థవంతంగా వ్యవహరించి తక్కువ వ్యవధిలో కేసును ఛేదించారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో విశ్వంకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు



విద్యార్థులను అభినందిస్తున్న విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల(ఏపీఆర్‌జేసీ)ల్లో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు రాష్ట్రస్థాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులతో పాటు టాప్ 10లో 9ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ఆ మేరకు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాల్లో ఆర్.తనూజ, ఎం.భువనేశ్వర్‌రెడ్డి రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకులు, టి.వర్షా, కె.లక్ష్మణవర్మ ద్వితీయ, బి.భువనేశ్వరి, బి.సిద్ధార్థలు తృతీయ ర్యాంకులు, అలాగే పి.సౌమ్య 5వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

జమ్మలమడుగు(వైఎస్సార్‌జిల్లా) : ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, వైద్యపరీక్షలు నిర్వహించడం, సైలైన్ బాటిళ్లు ఎక్కించడం చేయరాదని డీఎంహెచ్‌ఏ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పలు ఆర్‌ఎంపీ వైద్యశాలలను జిల్లా వైద్యాధికారులు తనిఖీ చేశారు. డీఎంహెచ్‌ఏ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శాంతికళ, డీఈఎంఓ ప్రమీలలు ఆర్టీసీ బస్టాండ్, అలంకార్ హాల్ తదితర ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ వైద్యులు నిర్వహిస్తున్న క్లినిక్‌లను తనిఖీ చేశారు. చాలా మంది సరిఫికెట్‌లు లేకున్నా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు ధ్రువీకరించారు. అనంతరం వారికి నోటీసులను జారీ చేశారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు పట్టణంలో పలు ప్రాంతాల్లో దాడులు చేశామని, చాలా మంది ధ్రువీకరణ పత్రాలు లేకుండానే వైద్యం చేస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రజలు కూడా ఆర్‌ఎంపీల వద్దకు కాకుండా ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలని,నిపుణులైన వైద్యుల వద్దే వైద్యం చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు,పాలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంపులోపడి వ్యక్తి మృతి



బ్రహ్మానందరెడ్డి (ఫైల్)

లింగాల : వైఎస్సార్ జిల్లా రామనూతలపల్లె గ్రామానికి చెందిన ఆర్ బ్రహ్మానందరెడ్డి(55) అనే వ్యక్తి గురువారం మధ్యాహ్నం ఆయన పొలంలో ఉన్న వ్యవసాయ సంపులో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. వివరాలు.. బ్రహ్మానందరెడ్డి పులివెందులలో నివాసముంటున్నాడు. పొలంవద్ద వ్యవసాయ మోటార్లను ఆడించేందుకు సంపువద్దకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలుజారి సంపులో పడిపోయాడు. ఆయనకు ఈత రాకపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్‌చేయగా ఫోన్‌పనిచేయలేదు. దీంతో వారు హుటాహుటిన పొలంలో వెతికారు. ఆయన సంపులో విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే మృతదేహన్ని వారి నివాసానికి తరలించారు. ఆయనకు భార్య ఇందిరమ్మ, కుమారుడు ఉన్నారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన వసతులు

బద్వేలు అర్బన్ : కడప జోన్ పరిధిలోని అన్ని డిపోల్లో ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తామని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఈడీ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం వైఎస్సార్ జిల్లా బద్వేలు డిపోను ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన డిపోలో ప్రయాణికులకు అందుతున్న వసతులను, కార్గో పార్శిల్ యూనిట్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బద్వేలు డిపోలోని ప్లాట్‌ఫాం పైకప్పునకు తక్షణమే మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. గ్యారేజీలోని కార్మికులతో మాట్లాడి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చి ఆర్టీసీపై మరింత నమ్మకం పెరిగేలా చూడాలని కోరారు. బస్సులను పరిశుభ్రంగా ఉంచుకుని ఆర్టీసీ ఆదాయం పెంచుకునేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు



ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా గ్రంథాలయాధికారి మధుబాల

మదనపల్లె సిటీ : గ్రంథాలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయాధికారిణి మధుబాల అన్నారు. గురువారం స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణాశిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 71 గ్రంథాలయాలు ఉన్నాయని, ఇందులో 49 వాటిల్లో వేసవి శిక్షణాశిబిరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రంథాలయాల్లో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. గ్రంథాలయాల్లో అదపు సిబ్బంది నియామకం కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అనంతరం వేసవి శిబిరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారిణి వసంతకుమారి, బి.టీ కాలేజీ కరస్పాండెంట్ మునిరత్నమయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

లంకమలలో పెరుగుతున్న చిరుతలు



అట్లూరు : లంకమల్లేశ్వర అభయారణ్యంలో చిరుతపులులు ఏటికేడాది పెరుగుతున్నాయి. గత నెలలో పులుల గణనలో భాగంగా కెమెరాలు అమర్చారు. వాటిని పరిశీలించగా సుమారు 60 చిరుత పులులు ఉన్నట్లు తేలిందని అటవీ అధికారులు తెలిపారు.గతంలో 30 నుంచి 40 ఉండేవని చెప్పారు. సిద్దవటం, అట్లూరు, బద్వేలు మండలాల పరిధిలో లంకమల్లేశ్వర అభయారణ్యం సుమారు 27 వేల హెక్టార్లలో విస్తరించి ఉంది. నల్లమలతో పాటు ఇది కూడా దట్టమైన అడవి. అపారమైన అటవీ సంపద ఉంది. జంతు జాతులైన జీవారాసులకు కూడా నిలయం అని చెప్పవచ్చు. లంకమల్లేశ్వర అభయారణ్యం పరిధిలో గత నెలలో అధునాతనమైన కెమెరాలను అమర్చారు. వాటిని పరిశీలించగా అందులో చిరుతపులులతో పాటు రకరకాల జంతువుల చిత్రాలు దర్శనమిచ్చాయి. లంకమల్లేశ్వర అభయారణ్యంలో పులుల గణనలో భాగంగా 2019 మేనెలలో అమర్చిన కెమెరాల్లో పెద్దపులి (టైగర్)దర్శనమిచ్చింది.ఆపై కనిపించలేదు.పెద్దపులి ఉనికిని కనుగొంటామని సిద్దవటం రేంజ్ అధికారి ప్రసాద్‌తెలిపారు. లంకమల్లేశ్వర అభయారణ్యంలో చిరుతపులుల సంఖ్య పెరుగుతోందని, ప్రస్తుతం 60 ఉన్నట్లు గుర్తించామని ప్రసాద్ తెలిపారు.

ఆత్మహత్యకు యత్నం : కాపాడిన పోలీసులు

కలసపాడు : వైఎస్సార్‌జిల్లా మామిళ్లపల్లెకు చెందిన బొజ్జ చంటెమ్మ కుమారుడు బొజ్జ గురుమోహన్ అనే వ్యక్తి భార్యతో గొడవపడి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు.తల్లి ఫిర్యాదుతో అతని పోలీసులు కాపాడారు. వివరాలు..గురుమోహన్ పోరుమామిళ్లలో నివాసం ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి పది సంవత్సరాల క్రితం శేషమ్మతో వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బుధవారం మధ్యాహ్నం భార్యతో గొడవపడిన అతను తన కుమార్తెలలో ఇద్దరిని తీసుకుని గిద్దలూరుకు వెళ్లి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంటానని తన తల్లి చంటెమ్మకు ఫోన్ ద్వారా తెలిపారు. చంటెమ్మ పోలీసులకు రాత్రి ఫిర్యాదు చేసింది. స్థానిక ఎస్ఐ నాగమురళి వెంటనే కడప సైబర్ క్రైమ్ ఎస్ఐ మధుమల్లేశ్వర్‌రెడ్డి, గిద్దలూరు పోలీసులకు సమాచారం అందించి గురుమోహన్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా ట్రేస్‌అవుట్ చేసి గిద్దలూరు రైల్వేస్టేషన్ ప్రాంగణంలో గుర్తించి స్థానిక పోలీసులకు గిద్దలూరు పోలీసులు అప్పగించారు. గురువారం ఎస్ఐ నాగమురళి గురుమోహన్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి తన తల్లికి అప్పగించారు. గురుమోహన్, ఇద్దరు పిల్లల ప్రాణాలను కాపాడిన ఎస్ఐని అభినందించారు.